# సానుతాపాలు

రచన: భళ్ళమూడి రమణమూర్తి

గడ్డురోజులు-పీక కోసుకొని చావ్వాలంటె కత్తి ముక్క అయినా బజారులో సుకరంగా దొరకని రోజులు. అన్నీ కరువే...అలాంటప్పుడు,—బంగారంలాంటివి—క్రొత్త...స్లిప్పర్లు...పోవడమంటే సామాన్యమా!? తాతలనాటి చింకి చెప్పులు కనుపించడం భాగ్యం, వెంటనే బాగు చేయించుకొని ఉపయోగించి పరమానందపడే యీ రోజుల్లో—చిరకాలంనించి యినప్పెట్టిలో దాచిదాచి, తీసి తొడిగి నాలుగురోజులయినా కాని, కొత్త స్లిప్పర్లు పోగొట్టుకొన్న మనసు ఎంత ఘోరంగా, విషాదాంత నాటకంలోని భీభత్సరంగంగా ఉంటుందో, 'కిస్మత్' ఫిలిం జూచి జోళ్ళుపోయిన కాళ్లతో చీకట్లో నడిచిన—నిషానాథ్—(నిశానాధు) రావుకి తెలిసొచ్చింది అనుభవఫలంగా...

తన స్లిపర్ల మీది మమత్వకొద్దీ—

"బంగారం లాంటి స్లిప్పర్లు—పాద దాసిగా—సహమార్గచారిణిగా నాభారీ శరీరాన్ని ఏరోప్లేన్ మల్లే మోస్తూండవలసిన— నా సరిక్రొత్త పడుచు స్లిప్పర్ జోడీ నన్ను విషాద సముద్రంలో ముంచి, తెలీకుండా...పోయింది...పోయింది—"

అని ఒక నల్లభై ఉత్తరాలు తన మిత్రులకూ పరిచితులకూ, వ్రాయగా, వారానికల్లా టీక్‌మని చాలా వచ్చిపడ్డాయి, జవాబులు.

(1) "డియరెస్ట్!...నిషా!...భాయ్. బంగారంలాంటి నీ స్లిప్పర్లకేంగాని, ఎన్నో కథలూ కామెడీ, ట్రాజడీ, వ్యంగ, హాస్య, గీతికాగేయ, నాటికేకాంకిక లెన్నో వ్రాసివ్రాసివాసికెక్కిన నా 'నల్ల' పక్షీంద్రుడు, వజ్ర'పాళీ'యుడు, రెక్కలొచ్చి నన్నువీడిపోయింది"

—ధూమేశ్వర్.

(2) Slip=జారిపోవు — స్లిప్పర్=జారిపోవునది. కాబట్టి జారిపోయింది. No Matter, It's Natural—ఇతి నిర్వచనమ్.

—(ఒక) ఎమ్. ఏ.

(3) "కేపిటలిస్టు కర్మాగారపు—కార్మిక రక్తాలను హరించుకొని తయారయిన జోళ్ళు—పనివాళ్ళకు న్యాయం, హక్కులు—సామ్యవాదం వచ్చేవరకూ అటువంటి జోళ్లు కొనకండి..."

—కామరేడు.

(4) "మనం ఆంధ్రులం. జాతీయత—దేశీయత—మరవకండి. సుప్రసిద్ధాంధ్ర దేశీయ గొడారి తయారు ఆకుజోళ్లే కొనండి. ఎందుకొచ్చిన పరాయి జోళ్ళు..."

—శుద్ధాంధ్రశ్రీ.

5. "అనవసరంగా కొత్తవి కొనకండి.—డబ్బు నిలువచెయ్యండి-అంతదాకా ఎక్కడైనా పాతవి...యుద్ధానంతరం..."

—ధూరదృష్టి

(6) "పాదుకలువాడండి-విరగవు, తరగవు, అరగవు-'పాదుక' ఫిలిం చూచారుగా-చూసి నేర్చుకోండి——పాదుకలకే పట్టాభిషేకం చెయ్యండి."

—రాజేశ్వరన్.

(7) "హడాడా—రొంబవిషారం.-మీపోయి స్లిప్పర్సుగూర్చి చిన్న టాపికల్ న్యూస్‌రీల్ తీస్తే... నేను ప్రయత్నము చేసుదునులేండి—మీ జోడులు అగపడెనా—నా ఫిలుముపడంలో Big-close up లో చూపిస్తాను సార్."

రాబోవుచున్నది...పక్షీంద్ర-వారి- మొదటి తెనుగుమాట పడం "చెప్పుకాటు కుక్కదెబ్బ" నిరీక్షింపుడు.

—దర్శిక్

(8) "...ప్రకారము ఉదహరింపబడిన సదరు స్లిప్పర్లు-(హక్కుదారు - లేటు...కుమార్డు నిశానాధం) అనే అసామీ-కాపురం—; చరాస్తియున్నూ, చిరకాలము హక్కు-భుక్తములై ఉన్న వాటిని, వాని సంబంధించిన ఏవిధ

మైన వాటినిగాని, క్లాజు-సెక్షను - అనుసరించి కొనరని, కొనరాదని ఇందుమూలకంగా తెలియ జేయడము అయినది..."

—న్యాయవేది.

(9) "అజాగ్రత్తగా ఉండరాదు" అన్నదాని కిదొక గుణపాఠము 'అజాగ్రత్త' అన్నపదాన్ని మీ శబ్దకోశమునుండి బహిష్కరించి 'అజాగ్రత్త' అని నూరుసార్లుఇంపొజిషన్ వ్రాయడం మంచిది. 'అజాగ్రత్త'ను పాతమార్చాలి.

—చిన్నప్పటి మేష్టరు.

(10) "చెప్పుల విషయమై అమూల్యసలహా, ఉచితము!! అతిగోప్యము-పోస్టుబిళ్ళలు 0-8-0, పంపించండి-తెలియజేస్తాము-"

—"శ్రేయోనిలయము."

"..........."

(11) మీ చొక్కాలకు, పంట్లాలకు రహస్యజేబులు కుట్టించితే-చెప్పు లందులో దాచుకో వచ్చు-ఇది పరమరహస్యం.

కాఫీరైట్-Golden idea.

—జెంట్స్ టైలరు.

(12) "రైలు పెట్టెల్లోను సినిమా హాల్సులోను, ఆఫీసు, దేవాలయాది జనసమ్మర్ద ప్రదేశాల్లో చెప్పుల దొంగలున్నారు జాగ్రత్త" అని బల్లలు కట్టించాలి. సైకిళ్ళకు-మోటార్లకువలె నే చెప్పులకు రిజిస్టరు నెంబర్లుండాలి. చెప్పులను రిజిస్టరు చేయించుకోవాలి-వీటి విషయమై అన్ని రాజ్యాలవారు—సమావేశమై శ్రద్ధవహించాలి. ఇది మా సలహా.

—సలహా సంఘం.

(13) "కొత్తజోళ్లు" అన్న శీర్షికతో చిన్న ఏకాంకిక వ్రాసి పంపండి. పోస్టు ముద్రములతో మా తోలిచూలు పత్రికా పుత్రికలో వేస్తాం.

—'భవిష్యత్' సంపాదకుడు.

(14) "స్లిప్పర్ల జాగ్రత్తకోసం ఒక నౌఖరుని 10 రూపాయలకు కుదుర్చుకొని, రేషనింగ్ ఆఫీసుకుపోయి కొత్తకార్డు తెచ్చుకోండి.

F.O.S.

(15) 'పాతవైనా, కొత్తవైనా ముందే జాగ్రత్తపడండి. మున్ముందు దొరకనే దొరకవు. కంట్రోలు - రేషనింగులు - పెర్మిట్ వస్తుంది. లైసెన్సు పొందనిదే చెప్పులు వేసుకోగూడదేమో ?'

—జ్యోతిష బ్రహ్మశ్రీ.

(16) "ప్రపంచైక శాంతిమూర్తి రూజ్వెల్టు-పోయాడు-చర్చిలువంటివారు పదవి విడిచి పోవడానికి సిద్ధమయ్యేరు-వేవెల్ యేమీఫలం పొందలేకపోయె - హిట్లరు పోయాడు-ఎన్నో, పోతూండగా, దేశమంతా-నాయకుల విడుదల-స్వాతంత్ర్య వాగ్దానాలు అయిపోతుండగా, స్లిప్పర్లకెందుకండీ ఏడుపు-'లేరా-నిదురమానరా భారత వీరకుమారా !'......"

—రాజకీయవేత్త.

(17) "దిన వార, మాస పత్రికల్లో ముఖ్యంగా సినీమాపత్రికలో రెండురంగుల్లో మీ పోయిన స్లిపర్ల ఫోటోతో సహా ప్రకటించండి."

—'ఘటసులాడి'

(18) 'బి. సి.' నాటి మూఢాచారాల్ని వదలండి. దేవాలయానికి వెళ్లకండి. తప్పనిసరి అయితే చెప్పులతోనే మ్రొక్కండిగాని, పైని విడువవద్దు. ఇది నవ 20 శతాబ్ది చాదాల్ని రక్షించేవి చెప్పులు; గాని దేవుడనే రాయి కాదు.-అని నమ్మండి."

—నవీన్.

(19) "మీ ఉత్తరం నాకు చాలా మానసిక విషాదాన్ని, తలనొప్పిని కలిగించింది. క్షమించి అమృతాంజనమో, ఆస్ప్రినో పార్సెలు చెయ్యండి.

—"అనామ్"

(20) "—...ఏమీ ! బంగారంలాంటి—చెప్పులా ???!! తోలు చెప్పులా-అంతా అబద్ధం. సాత్యమూలేదు. న్యూసెన్సు-కేసు కొట్టేశాం.

—రిపోర్టు.